మేడ్చల్ ఏసీపీ బదిలీ

మేడ్చల్: ఎన్నికల బదిలీల్లో భాగంగా మేడ్చల్ ఏసీపీ వెంకట్‌రెడ్డి బదిలీ అయ్యారు. ఆయన మేడ్చల్ నుంచి నగరంలోని సుల్తాన్‌బజార్ ఏసీపీగా బదిలీపై వెళ్లారు. మేడ్చల్ డివిజన్ ఏసీపీ సర్కిల్ ఏర్పడ్డాక మొదటి ఏసీపీగా వెంకట్‌రెడ్డి పనిచేశారు. మేడ్చల్ ఏసీపీగా నగర ఎస్‌బీలో పనిచేస్తున్న ఏసీపీ సీహెచ్ శంకర్‌రెడ్డి వచ్చారు.

మేడ్చల్ ఎంపీడీఓగా వసంతలక్ష్మీ

మేడ్చల్: మేడ్చల్ మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా వసంతలక్ష్మీ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. వసంతలక్ష్మీ శంషాబాద్ ఎంపీడీఓగా పనిచేసి బదిలీపై మేడ్చల్‌కు వచ్చారు. మేడ్చల్ ఎంపీడీఓగా పని చేసిన పద్మావతి రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు.

జవహర్‌నగర్ కమిషనర్‌గా తాజ్‌మోహన్‌రెడ్డి



జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ నూతన కమిషనర్‌గా తాజ్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లో మెరుగైన సేవలు అందజేస్తానన్నారు. అనంతరం నూతన కమిషనర్ తాజ్‌మోహన్‌రెడ్డికి మున్సిపల్ ఆర్‌వో ప్రభాకర్‌యాదవ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు మల్లెపూల శ్రీకాంత్‌యాదవ్, మున్సిపల్ సిబ్బంది కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా నాగరాజు

మేడ్చల్: ఎన్నికల బదిలీలో భాగంగా మేడ్చల్ మున్సిపల్ కమిషనర్ త్రిలేశ్వర్‌రావు పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బదిలీ అయ్యారు. ఆయనను కౌన్సిలర్లు, సిబ్బంది ఘనంగా సన్మానించి వీడ్కోలు పలికారు.

నూతన కమిషనర్‌గా నాగిరెడ్డి



యాదాద్రి భువనగిరి జిల్లా భువనగిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా పనిచేసిన బి.నాగిరెడ్డి మేడ్చల్ మున్సిపల్ కమిషనర్‌గా బదిలీపై వచ్చారు. మేడ్చల్ మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఆయన ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఆయనకు కౌన్సిలర్లు, సిబ్బంది స్వాగతం పలికారు

ఘట్‌కేసర్ ఎంపీడీఓగా గీతారెడ్డి



ఘట్‌కేసర్ ఎంపీడీఓ గీతారెడ్డి



ఘట్‌కేసర్ తహసీల్దార్ రజని

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ ఎంపీడీఓగా ఎల్.గీతారెడ్డి, తహసీల్దార్‌గా డీఎస్ రజనీ బుధవారం బాధ్యత స్వీకరించారు. ఎంపీడీఓ గీతారెడ్డి వలిగొండ మండలం నుంచి ఘట్‌కేసర్‌కు బదిలీ కాగా, రంగారెడ్డి కలెక్టర్ కార్యాలయంలో యూఎల్సీ తహసీల్దార్‌గా పనిచేసిన రజని ఘట్‌కేసర్ మండల తహసీల్దార్‌గా బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. కాగా ఎంపీడీఓను ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి, ఎంపీఓ నందకిశోర్, సీనియర్ అసిస్టెంట్ కుమార్ కార్యాలయం ఇతర సిబ్బంది ఆమెను శాలువాతో సత్కరించారు. అలాగే నాయబ్ తహసీల్దార్ సందీప్‌కుమార్‌రెడ్డి, ఆర్‌ఐలు పద్మనాభచారి, సాయిరాం, ఇతర సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి నూతన తహసీల్దార్‌కు అభినందనలు తెలిపారు.

తూంకుంట కమిషనర్‌గా వెంకటగోపాల్



శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీ కమిషనర్‌గా వెంకటగోపాల్ బాధ్యతలు స్వీకరించారు. బదిలీల్లో భాగంగా నర్సాపూర్ మున్సిపాలిటీ నుండి తూంకుంటకు వచ్చారు. ఆయనను మేనేజర్ శ్రవన్‌కుమార్, టీఎన్‌జీఓ జనరల్ సెక్రెటరీ ప్రభాకర్, మున్సిపల్ సిబ్బంది స్వాగతం పలికారు.

శామీర్‌పేట ఎంపీడీఓగా మమత



శామీర్‌పేట్: శామీర్‌పేట ఎంపీడీఓ మమత బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ విధులు నిర్వహించిన ఎంపీడీఓ గర్‌దాస్ వాణి రంగారెడ్డి జిల్లాకు బదిలీ అయ్యారు. నూతన ఎంపీడీఓ మమతను ఎంపీపీ యెల్లుబాయి, జెడ్పీటీసీ అనిత శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు.

జిల్లా పౌర సంబంధాల అధికారిగా అరుంధతి



సాక్షి, మేడ్చల్ జిల్లా: మేడ్చల్– మల్కాజిగిరి జిల్లా పౌర సంబంధాల అధికారిగా యు.అరుంధతి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అరుంధతి హైదరాబాద్ జిల్లాలో అదనపు పౌర సంబంధాల అధికారిగా విధులు నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గౌతమ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి ఆమె పుష్పగుచ్ఛం అందజేశారు.

కీసర 108 సిబ్బందికి ప్రశంసలు

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీ శివారెడ్డిగూడ చౌరస్తాలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గాయాలైన ఇద్దరిని కీసర 108 సిబ్బంది అత్యవసర సేవలందించి ప్రాణాలు కాపాడారు. రాంపల్లి గ్రామానికి చెందిన ప్రశాంత్(32), శ్రీకాంత్(26) ఘట్‌కేసర్ నుంచి ఇంటికి వెళ్తుండగా శివారెడ్డిగూడ చౌరస్తా వద్ద గుర్తుతెలియని వాహనం ఢీకొని తీవ్ర గాయాలయ్యాయి. కీసర 108 వాహనం సిబ్బంది ఈఎంటీ చిత్రం రవి, పైలట్ రాంచందర్ అత్యవసర సేవలు అందిస్తూ గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రశాంత్‌ను పరీక్షించిన అక్కడి వైద్యులు త్వరగా ఆస్పత్రికి తీసుకురావడంతో ప్రాణాపాయం తప్పినట్లు తెలిపారు. కీసర 108 సిబ్బందిని అభినందించారు. బాధిత కుటుంబీకులు వారికి ధన్యవాదాలు తెలిపారు.

నేనంటే.. నేనే..!

లోక్‌సభ సీటుపై కన్నేసిన నాయకుల్లో పోటాపోటీ

- కోడ్ కూయలే.. అభ్యర్థిత్వం ఖరారు కాలేదు..
- నియోజకవర్గంలో ప్రచారంలోకి ఆశావహులు
- ఫ్లెక్సీలు, ప్రచార రథాలు, వాల్ రైటింగ్‌లు
- మరోపక్క సీటుపై స్థానిక నేతల లోకల్ నినాదం

సాక్షి, మేడ్చల్ జిల్లా: దేశంలో అతిపెద్ద పార్లమెంట్ నియోజకవర్గమైన మల్కాజిగిరిలో భారతీయ జనతా పార్టీ(బీజేపీ) నుంచి ఆశావహుల తాకిడి అధికంగా ఉంది. పార్టీ అధిష్టానం అభ్యర్థుల జాబితా తయారీలో తలమునకలై.. గెలుపు గుర్రాల ఎంపికపై కసరత్తు ముమ్మరం చేస్తున్న నేపథ్యంలోనే.. ఈ లోక్‌సభపై కన్నేసిన ఆశావహులు తమకే టికెట్ ఖరారైనట్లుగా.. నియోజకవర్గంలో ఎన్నికల ప్రచార ఆర్భాటంలో భాగంగా ఫ్లెక్సీల ఏర్పాటు, గోడలపై వాల్ రైటింగ్ కార్యక్రమాన్ని చేపడుతున్నారు. మరికొందరైతే.. మరో అడుగు ముందుకేసి వాల్‌పోస్టర్లు అతికించడంతో పాటు ఎన్నికల ప్రచార రథాలను పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో తిప్పుతున్నారు. పార్టీ అధిష్టానం అభ్యర్థులను ఖరారు చేయకముందే.. పలువురు నేతలు ఎన్నికల ప్రచారాన్ని మరిపించేలా కార్యక్రమాలను చేపట్టడంపై ద్వితీయ శ్రేణి నాయకులు, కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది.

- ఇటీవల ఢిల్లీలో బీజేపీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి నివాసంలో లోక్‌సభ అభ్యర్థుల విషయమై రాష్ట్ర ఎన్నికల కమిటీ సభ్యులు కె.లక్ష్మణ్, డీకే అరుణ, మురళీధర్‌రావు, బండి సంజయ్, ఈటల రాజేందర్, గరికపాటి మోహన్‌రావు, జితేందర్‌రెడ్డి, సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్ సమావేశమయ్యారు. ఇందులో రాష్ట్రంలోని 17 పార్లమెంటు నియోజకవర్గాల దరఖాస్తులను పరిశీలించగా, ఇందులో మల్కాజిగిరి స్థానానికి ఎక్కువ దరఖాస్తులు వచ్చినట్లు గ్రహించారు. ఈ సీటు కోసం మాజీ మంత్రి ఈటల రాజేందర్ పోటీ పడుతున్నారు. తన కున్న ప్రజాదరణ, రాజకీయ అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని మల్కాజిగిరి సీటు ఇవ్వాలని కోరుతున్నట్లు తెలిసింది. అలాగే, ఇదే సీటును మురళీధర్‌రావు ఆశిస్తున్నారు. దశాబ్దాలుగా తనకున్న జాతీయ స్థాయి అనుభవం, పార్టీకి అంకితభావంతో పనిచేయడం పరిగణనలోకి తీసుకుని పోటీకి అవకాశం ఇవ్వాలని ఈయన అడుగుతున్నట్లు తెలుస్తోంది. వీరే కాకుండా మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు హరీశ్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు ఎస్.మల్లారెడ్డి, కొంపల్లి మోహన్‌రెడ్డి, రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత కొమురయ్య, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ కూడా ఈ సీటును కోరుతున్నారు. ఈ సీటుపై ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్న నేపథ్యంలో నిర్ణయాన్ని అధిష్టానానికి అప్పగించినట్లు ప్రచారం జరుగుతోంది.



పోటాపోటీగా ఆశావహుల హల్‌చల్

మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఏడు అసెంబ్లీ స్థానాలు మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, ఉప్పల్, ఎల్బీనగర్, కంటోన్మెంట్ ఉండగా, ఇటీవల జరిగిన శాసనసభ ఎన్నికల్లో అంతటా బీఆర్‌ఎస్ విజయం సాధించగా, బీజేపీ రెండో స్థానాన్ని దక్కించుకుంది. దేశ ప్రధాని నరేంద్ర మోదీ ప్రభంజనంతో సులభంగా.. మల్కాజిగిరిలో బీజేపీ గెలుస్తుందన్న ధీమా ఉండటం వల్ల.. ఈ సీటుపై ఆశావహుల సంఖ్య అధికంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలోనే ఆశావహులు పార్టీ అధిష్టానంతోపాటు ప్రజల అభిమానాన్ని చూరగొనేందుకు.. ఎన్నికల ప్రచార ఆర్భాటానికి తెరలేపినట్లు తెలుస్తోంది. అందులో భాగంగానే టికెట్ ఆశిస్తున్న ఆశావహులందరూ గోడలపై వాల్ రైటింగ్‌కు శ్రీకారం చుట్టారు. మరికొందరు ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడంతోపాటు పోస్టర్లు కూడా అంటిస్తున్నారు. పార్టీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు అయితే.. ఏకంగా ఎన్నికల ప్రచార రథాలనే నియోజకవర్గం పరిధిలో ప్రచారానికి తిప్పుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ వెలువడలేదు.. పైగా పార్టీ అధిష్టానం కూడా అభ్యర్థుల జాబితాను ఖరారు చేయలేదు. ఆశావహులు మాత్రం ఎన్నికల పోటీకి సిద్ధమవుతుండటంతో పాటు పలు కార్యక్రమాలతో ప్రజల వద్దకు వెళ్లడం కేడర్‌ను అయోమయానికి గురిచేస్తోంది.

స్థానిక పార్టీ నేతల్లో లోకల్ నినాదం..

మల్కాజిగిరి పార్లమెంట్ సీటుపై స్థానిక పార్టీ నాయకులు తీసుకుచ్చిన లోకల్ నినాదం కూడా కేడర్‌లో చర్చనీయాంశం అవుతోంది. మల్కాజిగిరి లోక్‌సభ స్థానంపై కరీంనగర్ జిల్లాకు చెందిన మాజీ మంత్రి, పార్టీ ఎన్నికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్, మధ్యప్రదేశ్ పార్టీ ఇన్‌చార్జి మురళీధర్‌రావు, మాజీ ఎంపీ చాడా సురేష్‌రెడ్డి, ఢిల్లీ పబ్లిక్ స్కూల్ అధినేత కొమురయ్య గురిపెట్టి ఎన్నికల ప్రచార కార్యకలాపాలు నిర్వహిస్తుండటంతో స్థానిక నేతలు కలవరానికి గురవడంతో పాటు లోకల్ నినాదాన్ని ముందుకు తెస్తున్నారు. బీజేపీ జాతీయ నాయకుడు మురళీధర్‌రావు కొన్నాళ్లుగా మల్కాజిగిరి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో పర్యటిస్తూ.. కార్యకర్తలతో సమావేశాలు నిర్వహించడం.. మరికొందరు నాయకులు ఫ్లెక్సీలు, వాల్‌రైటింగ్ వంటి కార్యక్రమాలు చేపట్టడం వంటి విషయాలు స్థానిక నాయకుల లోకల్ నినాదానికి కారణంగా చర్చ సాగుతోంది. ఏది ఏమైనా.. అభ్యర్థుల జాబితా ఖరారు కాకముందే.. ఆశావహులు మల్కాజిగిరి నియోజకవర్గంలో తామే అభ్యర్థి అన్నట్లుగా ఎన్నికల ప్రచార ఆర్భాటానికి వెళ్లటం ఈ రచ్చకు కారణమవుతోంది. స్థానిక పార్టీలో నెలకొన్న అయోమయం, లోకల్ చర్చ తదితర అంశాలకు అధిష్టానం ఏవిధంగా తెరదింపుతుందో వేచి చూడాల్సిందే..

కరెంట్ ఉండని ప్రాంతాలు

మేడ్చల్: మేడ్చల్ సబ్ స్టేషన్ పరిధిలోని సూర్యనగర్ కాలనీ ఫీడర్‌లో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా గురువారం పట్టణంలోని పలు కాలనీల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. పట్టణంలోని ఆర్‌టీసీ కాలనీ, సూర్యనగర్, మల్లికార్జుననగర్‌లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఆయన తెలిపారు.

నేడు 5కె రన్

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి మహిళా ఇంజినీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో గురువారం ఉదయం 5కె రన్ నిర్వహిస్తున్నట్లు ప్రిన్సిపాల్ మాధవిలత తెలిపారు. కార్యక్రమంలో మేడ్చల్ ఎమ్మెల్యే, మల్లారెడ్డి గ్రూప్స్ చైర్మన్ మల్లారెడ్డి పాల్గొననున్నట్లు తెలిపారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం



సీసీరోడ్డు పనులను ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి తదితరులు

కీసర: నాగారం మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో పెద్దఎత్తున అభివృద్ధి పనులను చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. మున్సిపల్ పరిధిలోని 16వ వార్డు చండీశ్వరీనగర్‌కాలనీలో సుమారు రూ.5 లక్షల మున్సిపల్ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బదనపురం శ్రీనివాస్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

డేంజర్.. జల్

- కాల్వలో పారుతున్నది మురుగు కాదు గరళమే..
- సాక్షి కథనానికి కదిలిన ప్రభుత్వ యంత్రాంగం
- నాలాలో నీటి పరీక్షల్లో తేలిన కఠోర వాస్తవాలు



నాలా వద్ద ఆందోళన చేస్తున్న ఉప్పల్ డివిజన్ మల్లికార్జున నగర్ వాసులు(ఫైల్)

ఉప్పల్: ఈ నెల 6వ తేదీన నిర్లక్ష్యాన్ని ఏమ'నాలా'? శీర్షికతో సాక్షి దినపత్రికలో ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కాలుష్యం వెదజల్లుతున్న నాలాలో పొల్యూషన్ బోర్డు అధికారులు నీటి శాంపిల్స్‌ను సేకరించారు. బోడుప్పల్ పరిధిలోని కొన్నిచోట్ల ఉప్పల్ జీహెచ్ఎంసీ పరిధిలో పలుచోట్ల అధికారులు శాంపిల్స్ సేకరించి వాటిని పరీక్షలకు పంపారు. ఫలితంగా కఠోరమైన వాస్తవాలు బయటపడ్డాయి. ప్రశాంతమైన కాలనీల్లో భయంకరమైన కాలుష్యపు నీరు ప్రవహిస్తోందని, దీంతో కాలనీలవాసులు కాలుష్యం భారిన పడుతున్నాయని నిర్ధారించారు.

- మల్లాపూర్, నాచారం, చర్లపల్లి తదితర పరిశ్రమల ప్రాంతాలకు చెందిన పారిశ్రామిక వ్యర్థాలను కొందరు స్వార్థపూరితమైన పరిశ్రమల యాజమానులు నిర్లక్ష్యంగా బోడుప్పల్ మున్సిపల్ పరిధిలోని రామ చెరువులోకి, నాలాల్లోకి, మరికొంత భూగర్భ మురుగు కాల్వల్లోకి వదులుతున్నారని, ఆ వ్యర్థాలు ఉప్పల్ నల్ల చెరువుకు చేరుకుంటున్నాయని, దీంతో చెరువులు కూడా నాశనమయ్యే ప్రమాదం వచ్చి పడిందని ఆందోళన వ్యక్తం చేశారు.
- ముఖ్యంగా శ్రీరామనగర్, రాఘవేంద్రానగర్, హేమానగర్, బోడుప్పల్ ద్వారకానగర్, బాలాజీహిల్స్, జ్యోతినగర్, మల్లికార్జుననగర్, చిలుకానగర్ తదితర ప్రాంతాలకు తీవ్రంగా కాలుష్య ముప్పు ఏర్పడిందని అధికారులు భావించారు. ఈ కాలనీల్లో నాలా పరివాహక ప్రాంతాల్లో తీవ్రమైన దుర్వాసన, ఇంట్లో ఉండలేనంతగా ఘాటైన వాసనలు వస్తున్నాయని తేల్చారు.
- భూగర్భ జలాలు సైతం కలుషితమైనట్లు గుర్తించారు. నాలాలో బ్రౌన్ కలర్ పారిశ్రామిక వ్యర్థాలు, మరోసారి తెల్లటి నీరు ఇలా అనేక రకాల కెమికల్ వ్యర్థాలు వస్తున్నాయని గుర్తించారు. కొన్ని పరిశ్రమలు సరిగ్గా వ్యర్థాలను శుద్ధి చేయకుండానే నేరుగా డ్రైనేజీ పైపుల్లోకి వదులుతున్నారని, దీని వల్ల పెను ప్రమాదం పొంచి ఉందని కూడా వారు తేల్చారు.
- ఇప్పటికే వందలాది మంది స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయని వారు గుర్తు చేశారు. రిపోర్టుల ఆధారంగా వెంటనే మేడ్చల్ జిల్లా కలెక్టర్‌కు, సీఈఈ టీఎస్‌పీసీబీ సనత్‌నగర్ కార్యాలయ అధికారులకు, జోనల్ కార్యాలయాలకు, మల్లాపూర్, నాచారం పారిశ్రామిక వాడల కమిషనర్లకు, పారిశ్రామికవాడల అసోసియేషన్లను అప్రమత్తం చేస్తూ తెలంగాణ స్టేట్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు రీజనల్ ఆఫీస్–1 రంగారెడ్డి జిల్లా అధికారులు ఫిర్యాదులు చేశారు.



రామ చెరువు నుంచి నాలా ద్వారా ఉప్పల్ నల్ల చెరువుకు చేరుతున్న వ్యర్థాలు

నగరానికి సమాంతరంగా శివారుల్లో అభివృద్ధి

సాక్షి, మేడ్చల్ జిల్లా: హైదరాబాద్ మహానగరానికి సమాంతరంగా శివారు రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల సమగ్రాభివృద్ధిపై అధికార యంత్రాంగం ప్రత్యేక దృష్టి సారిస్తోంది. శివారు జిల్లాల్లోని పురపాలక సంఘాలు, సెమీ అర్బన్, పట్టణాలుగా మారిన జీపీల్లో కనీస సమస్యలకు శాశ్వత పరిష్కారం, ఏకీకృత విధానంతో పాటు విద్య, వైద్య రంగాల అభివృద్ధి వంటి విషయాలపై సమగ్ర ప్రాజెక్టు రూపకల్పన అవసరమని భావిస్తోంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లా ఇన్‌చార్జి మంత్రి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు సమగ్రాభివృద్ధిపై నివేదికలు సిద్ధం చేయాలని కోరగా, రంగారెడ్డి, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు సంబంధిత అధికారులతో కార్యాచరణ ప్రణాళికను రూపొందిస్తున్నట్లు తెలుస్తోంది.

సమగ్ర ప్రాజెక్టుపై..

రంగారెడ్డి, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాల్లోని ప్రజలకు విద్య, వైద్యం వంటి అన్ని సౌకర్యాలు మరింతగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా సమగ్ర ప్రాజెక్టుపై యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే 'ఏ నియోజకవర్గం పరిధిలో ఏ సమస్యలు ఉన్నాయనే దానిపై ప్రాజెక్టును రూపొందించడంతో పాటు మౌలిక వసతులపై ఆయా శాఖల అధికారులతో కలిసి ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. రెండు జిల్లాల్లో ప్రభుత్వ దవాఖానాలు, మార్కెట్లు, నాణ్యమైన విద్యుత్ సరఫరా, రోడ్ల నిర్మాణం, పరిసరాలు పరిశుభ్రత, వరద ముంపు నివారణ, రెవెన్యూ, భూరిజిస్ట్రేషన్ సమస్యలకు శాశ్వత పరిష్కారాలను చూపడం ద్వారా భవిష్యత్తులో హైదరాబాద్‌తో పోటీపడేలా చేయాలన్న కొత్త సర్కారు లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది. పురపాలక సంఘాలు, జీపీల నుంచి వివిధ పన్నుల ద్వారా సమకూరే ఆదాయ వ్యయం, జీత భత్యాలు, ఆర్థిక సంఘం నిధులు తదితర విషయాలపై కూడా అధికార యంత్రాంగం కసరత్తు చేస్తోంది.

మున్సిపాలిటీ అక్రమాలపై సీఎంకు వినతి

ఘట్‌కేసర్: ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో జరిగిన అక్రమాలు, కమిషనర్లకు నోటీసుల జారీ, బిల్ కలెక్టర్లపై చర్యలు తీసుకోకపోవడంపై మాజీ సర్పంచ్ యాదగిరియాదవ్ సీఎం రేవంత్‌రెడ్డికి, పురపాలక కమిషనర్ సంచాలకులు, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి, జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్, విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి బుధవారం వినతి అందజేశారు. కార్యాలయం సిబ్బందిపై చర్యలు తీసుకోకపోవడం, సిబ్బంది అవినీతి ఆపకపోవడంపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని లేఖలో కోరారు.

అక్రమ నిర్మాణాలపై కమిషనర్‌కు ఫిర్యాదు

మేడ్చల్: పట్టణంలోని మూడవ వార్డులో అక్రమంగా మున్సిపల్, హెచ్ఎండీఏ అనుమతులు లేకుండా భవనాలు నిర్మిస్తున్నారని బీజేపీ పట్టణ ప్రధాన కార్యదర్శి జాకట ప్రేందాస్ అన్నారు. అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని కోరుతూ ఆయన ఈ మేరకు మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. బీఆర్ఎస్ నాయకుడు గడ్డం రాజ్‌కుమార్‌తో కలిసి వారు మున్సిపల్ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. కౌన్సిలర్ దేవ డబ్బులు తీసుకుంటూ అక్రమ నిర్మాణాలను ప్రోత్సహిస్తున్నారని ఆరోపించారు. అక్రమార్కులపై అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

ఘనంగా వసంత పంచమి



మేడ్చల్: వసంత పంచమి పండగను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని వివిధ ఆలయాల్లో వసంత పంచమి సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. వివిధ పాఠశాలల్లో సరస్వతీ దేవి పూజలు వైభవంగా నిర్వహించి చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. న్యూ లిటిల్‌లి పాఠశాలలో సరస్వతి, గణపతి హోమం నిర్వహించారు. వేడుకల్లో పాఠశాల కరస్పాండెంట్ మంజుల ప్రకాష్, భక్తులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఘట్‌కేసర్: ఇన్నోవా కారు ఓ బైక్‌ను ఢీకొనడంతో ఇద్దరికి గాయలైన ఘటన ఘట్‌కేసర్ మున్సిపాలిటీలో జరిగింది. సీఐ గోవర్ధనగిరి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కీసర మండలం రాంపల్లి గ్రామానికి చెందిన దప్పు ప్రశాంత్(32), దప్పు శ్రీకాంత్(26) అన్నదమ్ములు. పని ముగించుకొని మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో ఇంటికి వెళ్తున్నారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద ఇన్నోవా కారు వేగంగా వచ్చి బైక్‌ను ఢీకొట్టింది. దీంతో బైక్ నడుపుతున్న ప్రశాంత్‌కు తలకు, కడుపులో.. వెనుక కూర్చున్న శ్రీకాంత్‌కు తీవ్ర గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న 108 సిబ్బంది స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి ప్రాథమిక చికిత్స అందించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం గాంధీ ఆస్పత్రికి తరలించారు. ప్రశాంత్ భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

అమ్మవారి ఆశీస్సులు అందరిపై ఉండాలి



ముత్యాలమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠలో ఎమ్మెల్యే మల్లారెడ్డి

జవహర్‌నగర్: ముత్యాలమ్మ అమ్మవారి ఆశీస్సులు ప్రజలందరిపై ఉండాలని మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు. జవహర్‌నగర్ కార్పొరేషన్‌లోని లెప్రసీ కాలనీలో ముత్యాలమ్మ ఆలయ కమిటీ చైర్మన్ బూడిద వెంకటేష్ ఆధ్వర్యంలో ముత్యాలమ్మ ఆలయంలో బుధవారం నూతన విగ్రహ ప్రతిష్ఠ భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి మాజీ మంత్రి, ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి, కార్పొరేటర్ కారింగుల నిహారికగౌడ్, మాజీ సర్పంచ్ కారింగుల శంకర్‌గౌడ్‌లు హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బీఆర్ఎస్ నాయకులు రమేష్‌చారి, మహేష్, మహనీయుల ఉత్సవ కమిటీ అధ్యక్షులు మండల సురేందర్, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న కౌన్సిలర్ హరిప్రసాదరావు

పోచారం: సంస్కృతి టౌన్‌షిప్‌లోని శ్రీగిరి వేంకటేశ్వరస్వామి ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారికి సంస్కృతి టౌన్‌షిప్ ఫ్లాట్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు, కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు పట్టువస్త్రాలు సమర్పించారు. ఎంపీపీ ఏనుగు సుదర్శన్‌రెడ్డి విచ్చేసి స్వామి వారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో స్థానిక నాయకులతో పాటు టౌన్‌షిప్‌వాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

అభివృద్ధికి దాతల సహకారం అభినందనీయం

మేడ్చల్: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసేందుకు దాతలు ముందుకు వచ్చి విరాళాలు ఇచ్చి పనులు చేయడం అభినందనీయమని ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి అన్నారు. మండలంలోని లింగాపూర్ నుంచి బర్మాజీగూడ కల్వర్టు వరకు రోడ్డుకు వీధి దీపాల ఏర్పాటుకు 60ఎల్ఈడీ బల్బులను ఎర్రవల్లి రాంరెడ్డి, ఎర్రవల్లి వెంకట్‌రెడ్డి, చంటిలు విరాళంగా ఇచ్చారు. విరాళంగా ఇచ్చిన బల్బులను స్తంభాలకు ఏర్పాటు చేయగా ఎంపీపీ రజిత రాజమల్లారెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం గ్రామానికి చెందిన పెద్ద మనుషులు పెద్ద మనసుతో ముందుకు వచ్చి తమ సొంత డబ్బులు వెచ్చించి పనులు చేయించడం హర్షణీయం అన్నారు.

వీధి కుక్కల బెడద తగ్గించేందుకు చర్యలు



కీసర: దమ్మాయిగూడ మున్సిపాలిటీలోని వివిధ వార్డుల్లో వీధి కుక్కల బెడద తగ్గించేందుకు చర్యలు చేపట్టడం జరుగుతుందని మున్సిపల్ చైర్‌పర్సన్ వసుపతి ప్రణీతాగౌడ్ అన్నారు. మున్సిపల్ పరిధిలోని 4వ వార్డులో కౌన్సిలర్ మంగళపురి వెంకటేష్ విజ్ఞప్తి మేరకు వీధి కుక్కలను పట్టి డాగ్స్‌వ్యాన్‌లో దూరంగా తరలించేందుకు సిబ్బంది చేపట్టిన పనులను బుధవారం ఆమె పరిశీలించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదుల మేరకు వీధి కుక్కల బెడద తగ్గించేందుకు మున్సిపల్ నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. వీలైనంత త్వరలో వివిధ వార్డుల్లో వీధి కుక్కలను పట్టి జీహెచ్ఎంసీ జంతు విభాగానికి అప్పగించినట్లు చెప్పారు.